అంగన్వాడీ నియామక నోటిఫికేషన్ రద్దు చేయాలి : సిఐటియు

మదనపల్లె అర్బన్ : హడావిడిగా రాజకీయ నాయకుల జోక్యంతో విడుదల చేసిన అంగన్వాడీల నియామక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సాధించుకున్న అంగన్వాడీ హెల్పర్ల ప్రమోషన్లు, ట్రాన్స్ ఫర్ జీవోలను పక్కన పెట్టిన అధికారుల వైఖరిని తప్పుపట్టారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు హడావిడిగా నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టులలోనూ చాలామంది హెల్పర్లు ప్రమోషన్ల కోసం దరఖాస్తులు చేసుకుని ఎదురు చూస్తూ ఉన్నారని తెలిపారు. కొంతమంది అంగన్వాడీ కార్యకర్తలు సూపర్వైజర్‌లుగా పదోన్నతి పొందిన కేంద్రాలలో సహాయకులకు ప్రమోషన్ ఇవ్వాల్సి ఉన్నా, వర్కర్లు ప్రతి రోజూ ప్రయాణం చేయలేక పోతున్న అవసరమైన అంగన్వాడీ వర్కర్లకు బదిలీ సౌకర్యం కల్పించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉద్యోగోన్నతులు, బదిలీలు కావాలంటే ఎమ్మెల్యే, అధికార పార్టీ నేతల నుండి లేఖలు తీసుకురావాలని చెబుతూ తిప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ పోస్టుల నియామకం ఎమ్మెల్యేలకు అధికార పార్టీ నాయకుల జేబులు నింపడానికి కాదని విమర్శించారు.

బౌద్ధ రామాలకు రక్షణ కరువాయే...



బౌద్ధ ఆరామాలు

- పట్టని పురావస్తు శాఖ అధికారులు
- శిధిలమవుతున్న ఆరామాలు
- పురాతన కట్టడాలను కూల్చివేస్తున్న దుండగులు

ప్రజాశక్తి-నందలూరు

రాయలసీమకే తలమానికమైన నందలూరు మండలంలోని ఆడపూరు ముక్తికనుమ వద్ద ఉన్న ప్రాచీన బౌద్ధరామాలకు రక్షణ కరువైంది. ఆరామాలు శిథిలావస్థకు గురవుతున్నాయి. బౌద్ధరామాల గుట్టపై గుప్త నిధులు తవ్వకాల ముఠా కళ్ళు పడ్డాయి. పురాతన కట్టడాలు ఉండడంతో ఇక్కడ గుప్త నిధులు ఉంటాయన్న దురాశతో విధ్వంశానికి దిగుతున్నారు. చారిత్రక సంపదను రక్షించాల్సిన పురావస్తు అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో భావితరాలకు బౌద్ధ ధర్మం ఔన్నత్యాన్ని చాటుతున్న చారిత్రాత్మక కట్టడాలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరిట నిధులు విడుదల చేస్తున్న అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడం లేదని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించే పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన రహదారి కంప చెట్లతో మూసుకుపోయి పర్యాటకులకు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. ఆరామాలు ఉన్న ప్రాంతం అపరిశుభ్రం ముళ్ళ పొదలతో నిండి ఉంది. దీంతోపాటు గతంలో మంజూరు అయ్యిన నిధులతో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆడపూరు కనుమ వద్ద క్రీ,శ ఒకటి- రెండు శతాబ్దాల మధ్య బౌద్ధ పర్యాటకులు, ప్రచారకులు నివసించేవారు. చెయ్యేరు నది తీరంలోని గుట్టపై అప్పట్లో వారు నిర్మించుకున్న ఆరామాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. మిగతా కట్టడాలు మాత్రం శిథిలమయ్యాయి. ఇక్కడ ఒక మహా స్థూపం, 21 స్మారక స్తూపాలు (ఆరామాలు) ఉన్నాయి. అందులో కొన్ని ఆరామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. ఓ ఆరామాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. మరి కొన్నింటిలో తవ్వకాలకు ప్రయత్నించారు. ఈ బౌద్ధ క్షేత్రాన్ని అభివ ృద్ధి చేయటానికి పర్యాటకుల అతిథి భవనాల కోసం ప్రభుత్వం రూ.1.30 కోట్లు మంజూరు చేసింది. ఆరామాల గుట్ట పక్కనే ఉన్న పర్యాటకుల అతిథి భవనంలో బుద్ధిని విగ్రహం, ధ్యాన మందిరం, ఉద్యానవనం, సమాచార కేంద్రం, ఫుడ్ కోర్ట్ తదితర భవనాల నిర్మాణాలను ప్రభుత్వం నిర్మించింది. కానీ నాలుగు సంవత్సరాలు గడిచిన ప్రారంభానికి నోచుకోలేదు. పక్కనే ఉన్న బౌద్ధ రామాల రక్షణను మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో దుండగులు చారిత్రాత్మక నిర్మాణాలను ధ్వంసం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఈ బౌద్ధ రామాల వద్ద కాపలాదారున్ని నియమించారు. ఎందుకనో ఆ తరువాత తొలగించారు. గత కొన్ని సంవత్సరాలుగా కాపలాదారుడు లేకపోవడంతో అక్రమ తవ్వకాలకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చారిత్రాత్మక కట్టడాల పరిరక్షణకు చర్యలు చేపట్టి పర్యాటకులకు సౌకర్యంగా మార్చాలని స్థానికులు కోరుకుంటున్నారు.

బౌద్ధ రామాలపై దుండగులు తవ్విన గుంత

జలవనరులను కాపాడుకుందాం

జిల్లా అధికారి కృష్ణమూర్తి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని చెరువులలో నీటిని కలుషితం లేకుండా పొదుపు చేసుకుంటూ జలవనరులను కాపాడుకుందామని జిల్లా జలవనరుల అధికారి బి. కృష్ణమూర్తి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రైతులు నీటిని ఎలా పొదుపు చేసుకుని చెరువుల కింద పంట సాగు చేసుకోవాలో, జిల్లాలో రిజర్వాయర్లు వాటి పరిస్థితిని ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లా జలనరుల కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా డివిజన్ కార్యాలయాలు మదనపల్లె, కడప, కదిరి ప్రాంతాలలో ఉన్నాయి. సబ్ డివిజన్ కార్యాలయాలు రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, మదనపల్లి, తంబళ్లపల్లి, వాల్మీకిపురం, రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాల్లో ఉన్నాయి.

జిల్లాలో ఎన్ని రిజర్వాయర్ ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా మేజర్ రిజర్వాయర్లు చిన్నమండం మండలంలో శ్రీనివాసపురం రిజర్వాయర్, కె.వి.పల్లి మండలం అడవిపల్లె రిజర్వాయర్, మీడియం రిజర్వాయర్లు, రాజంపేట మండలం అన్నమయ్య ప్రాజెక్టు, గాలివీడు మండలం వెలుగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వా యర్లున్నాయి. మైనర్ రిజర్వాయర్ల విషయాకొస్తే నిమ్మనపల్లి మండలం బహుదా, తంబళ్లపల్లె మండలం పెద్దూరు రిజర్వాయర్లు, సంబేపల్లి మండలం ఝరికోన రిజర్వాయర్, టి.సుండుపల్లి మండలం పింఛా రిజర్వాయర్లున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఎన్ని చెరువులు ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 3272 చెరువులు, ఆయకట్టు 1,00,073 ఎకరాల ఉంది. 100 ఎకరాల పైబడి ఆయకట్టు కలిగినవి 154 చెరువులు ఆయకట్టు 53407 ఎకరాలున్నాయి. 100 ఎకరాల లోపు ఆయకట్టు చెరువులు 3118, ఆయకట్టు 46666 ఎకరాలు ఉన్నాయి.

గత ఏడాది తెగిన అన్నమయ్య ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడుతున్నారా?

2021 సంవత్సరం నవంబర్‌లో అతి భారీ వర్షాలకు జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు, పింఛా ప్రాజెక్టులు తెగిపోయాయి. అన్నమయ్య ప్రాజెక్టు పునర్నాణానికి 787.77 కోట్లు, పింఛా ప్రాజెక్ట్ పునర్నిర్మాణానికి 84.33 కోట్ల బడ్జెట్ మంజూరైంది. ఈ నెలాఖరులోపు టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి ఫిబ్రవరి మొదటి వారంలో పనులు మొదలుపెడతాం

తుపాను వల్ల చెరువులకు ఎలాంటి నష్టం వాటిల్లింది?

ఈ సంవత్సరం వర్షాలు వల్ల ఎలాంటి చెరువులకు నష్టం వాటిల్లలేదు. 2020 - 21 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 267 చెరువులు దెబ్బతిన్నాయి. అందులో 160 చెరువులకు మరమ్మతులు పూర్తి చేశాం. మిగిలిన చెరువులు పనులు జరుగుతున్నాయి.

జిల్లాలో మంజూరైన నిధులు, చేపట్టిన అభివృద్ధి గురించి వివరించండి?

ప్రపంచ బ్యాంక్ నిధులతో ఎపిఐఐటిపి ప్రాజెక్టు కింద చెరువులు బలోపేతానికి 13 పనులకుగానూ రూ.147 కోట్లు మంజూరయ్యాయి. అందులో 5 పనులు పూర్తి చేశాం. 8 పనులు పురోగతిలో ఉన్నాయి. జపాన్ నిధులతో ఎపిఐఎల్ టి పథకం కింద 19 పనులుకు రూ.15. 82 కోట్లు మంజూరయ్యాయి. ఐదు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కురబలకోట మండలం ముదివీడు బ్యాలెన్స్ రిజర్వాయర్‌కు రూ. 759. 50 కోట్లు విడుదల కాగా 25 శాతం పనులు పూర్తయ్యాయి. గాలివీడు లిఫ్టు వెలిగల్లు జలాశయం నుంచి రాయచోటి, గాలివీడు చెరువులకు నీటిని నింపడానికి రూ.94.56 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మంజూరయ్యాయి. ఝరికోన రూ.42.25, రామాపురం లిఫ్ట్ స్కీమ్ రూ.227.10 కోట్లు, కలిబండ బెస్తపల్లి లిఫ్ట్‌కు రూ.29.38 కోట్లు నిధులు మంజూరయ్యాయి. జిఎన్‌ఎస్ఎస్‌హెచ్ నుంచి హెచ్‌ఎన్ఎస్ఎస్‌కు అనుసంధానం లిఫ్ట్ స్కీమ్‌కు రూ.5.36 కోట్లు మంజూరైనాయి. గాలివీడు, తంబళ్లపల్లె, కురబలకోట పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే వెలగల్లు రిజర్వాయర్లకు నీళ్లు ఇవ్వడం జరుగుతుంది.

బ్లాక్ బెల్ట్ సాధించిన క్రీడాకారులు

తేక్వాండోలో రాజంపేట క్రీడాకారులకు బ్లాక్‌బెల్ట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 6 నుండి 8వ తేదీ వరకు విజయనగరంలో వినీష్ తేక్వాండో అకాడమీలో తేక్వాండో పోటీల్లో రాజంపేట క్రీడాకారులు బ్లాక్‌బెల్ట్ సాధించారు. తేక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు హర్షవర్ధన్ ప్రసాద్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్ ఉత్తీర్ణత పరీక్షలు, జాతీయ రెఫరి సెమినార్, రిఫ్రెష్మెంట్ కోర్సును నిర్వహించారు. బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో రాజంపేటకు చెందిన సగినాల రిజ్వాన్, ధనకోటి జ్ఞానసాయి ఆచారి, కురుగుంట్ల మనోజ్ కుమార్ నాయుడు, షేక్ మొహమ్మద్ హనీఫ్ ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్‌కు ఉత్తీర్ణులైనట్లు రాజంపేట తేక్వాండో శిక్షకుడు జాహిద్ అలి తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు గ్రాండ్ మాస్టర్ సగినాల పిచ్చయ్య వద్ద శిక్షణ పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపి జనరల్ సెక్రెటరీ ఎల్.టి.చంద్రమౌళి, వైస్ ప్రెసిడెంట్ గురుస్వామి, జాతీయ తేక్వాండో మాజీ కోచ్ రామేశ్వర్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి

స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష ఆదివారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్పందనకు వ్చచ్చిన అర్జీలకు సంబంధించిన పరిస్కారాలు ఎన్ని చేశారనే వివరాలతో అధికారులు రావాలన్నారు. అన్ని శాఖల అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం ఎపి గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ మదనపల్లి శాఖ ఎన్నికలలో అధ్యక్ష, కార్యదర్శులుగా బిటి.నరసింహులు, బి.వెంకటరమణలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎపి ఎన్‌జిఒ చిత్తూరు జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్ పిళ్లై, కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి కోదండ రాము, ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఆత్మానంద నాయుడు ఎన్నికల పరిశీలకులుగా పాల్గొన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఏకగ్రీవంగా నిర్వహించినట్లు ఎన్నికల పరిశీలకులు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు జాయింట్ సెక్రటరీలు, పది మంది ఇసి మెంబర్లను ఏకగ్రీవ ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మాజీ కార్యదర్శి ఎన్.మణి గోపాలకృష్ణ, పెన్షనర్లు పాల్గొన్నారు.



అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి మాట తప్పకూడదు : యుటిఎఫ్

2కె వాక్‌లో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకువస్తానని మాట చెప్పి నేడు మడమ తిప్పడం అన్యాయమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరిప్రసాద్, ఎస్.జాబీర్ తెలిపారు. సిపిఎస్ రద్దు చేయాలంటూ ఆదివారం సాయంత్రం స్థానిక మండల వనరుల కేంద్రం నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం వరకు 2కె వాక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సిపిఎస్ రద్దు చేస్తామని ఎటువంటి హామీ ఇవ్వని రాజస్థాన్, పంజాబ్, చత్తీస్‌ఘడ్, అస్సాం, తమిళనాడు తదితర రాష్ట్రాలలో సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయుటకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఓవైపు నిర్ణయం తీసుకున్నాయని పేర్కొన్నారు. మన ప్రభుత్వం అధికంలోకి వస్తే వారంలో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులచే ఓట్లు వేయించుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిపిఎస్ కంటే జిపిఎస్ మెరుగైందని చెప్పడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. సిపిఎస్ అమల్లోకి వచ్చే ముందు, అమల్లోకి వచ్చిన తర్వాత కూడా యుటిఎఫ్ స్వతంత్రంగా జీపు జాతాలు, పాదయాత్రలు, ముట్టడి కార్యక్రమాలు లాంటి ఉద్యమాలు చేస్తూ మరోపక్క రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఒక బలమైన ఐక్య ఉద్యమాన్ని నిర్మించిన తర్వాతనే ముఖ్యమంత్రి తన ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా సిపిఎస్‌ను రద్దు చేస్తానని మాటిచ్చిన విషయం తెలిసిందేనన్నారు. మూడున్నర ఏళ్లు గడిచినా ఈ ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయకపోగా జిపిఎస్ అనే పేరుతో మరో దుర్మార్గమైన పథకాన్ని తీసుకురావడం చాలా అన్యాయమని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరో పెద్ద ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎస్ జిల్లా కన్వీనర్ రమణమూర్తి, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చెంగల్ రాజు, రాజంపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, నాగేంద్ర, సీనియర్ నాయకులు ఎం.నాగేశ్వర్ గౌడ్, పెనగలూరు మండల ప్రధాన కార్యదర్శి నరసింహారావు, పుల్లంపేట మండల అధ్యక్షుడు సాంబ శివరావు, నందలూరు మండల కోశాధికారి సుధాకర్, చిట్వేలు, ఓబులవారిపల్లి మండలాలకు చెందిన యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు కావొచ్చు

జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు కావొచ్చునని, సైకిల్ గుర్తు తీసేసి శవం గుర్తు పెట్టుకోఇవాలని, ప్రజల్లో ఆయనకు విశ్వాసం, గెలిచే సత్తా ఉంటే పొత్తులెందుకని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం రాయచోటిలోని జడ్‌పి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన పర్యటనలతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారని చెప్పారు. గతంలో గోదావరి పుష్కరాలలో 29 మంది మృతికి కారణమయ్యారన్నారు. తన ప్రచార ఆర్భాటాల కోసం ఇరుకైన సందుల్లో జనాలను తరలించి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నట్లుగా డ్రోన్ కెమెరాలతో చిత్రీకరణకోసం ప్రజల మృతికి కారకులయ్యారన్నారు. ప్రజలలో టిడిపిపై విస్వాసం ఉంటే, గెలిచే సత్తా ఉంటే ఇక పవన్ కళ్యాణ్ తదితర పార్టీలుతో పొత్తులెందుకని ఆయన ప్రశ్నించారు. వైసిపికి 80 శాతంపైగా ప్రజ మద్దతు ఉందని చెప్పారు. .ప్రజల ప్రాణాలును కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇరుకు సందుల్లో సభలు,సమావేశాలు నిర్వహించకూడదని ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. ఈ జీవో కేవలం టిడిపి మాత్రమే కాదని, అన్ని పార్టీలకు వర్తిస్తుందని చెప్పారు. సీనియర్ నాయకుడుగా, మాజీ ముఖ్యమంత్రిగా పేరు నిలబెట్టుకోవాలని హితవు పలికారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచిని స్వాగతించాలన్నారు. అధి కారమే అజెండాగా అందుకోసం ఎంతవరకైనా టిడిపి దిగజారు తోందన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం తెచ్చిన జోవోను చీకటి జీవోగా గగ్గోలు పెట్టడం సరైందని కాదని తెలిపారు. నడిరోడ్లపై సభలు, సమావేశాలు పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉదేశంతో ప్రభుత్వ అనుమతితో ఖాళీ మైదానాలలో, ప్రదేశాలలో సభలు పెట్టుకోవచ్చన్నారు. ప్రజలంతా వారి వైపే ఉన్నారని, చంద్రబాబు అండ్‌కో మాట్లాడుతున్నారని, మీరందరూ కలవండి, కలసి పోటీ చేయండి, బి ఫారంలు కలసి ఒకరికొకరు ఇచ్చుకున్నా ఎవ్వరూ భయపడే స్థితిలో లేరన్నారు. సిఎం జగన్‌కు ప్రజాభిమానం మెండుగా ఉందన్నారు. గౌరవంగా, సంస్కారంగా మాట్లాడాలని, విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడితే ప్రజలు క్షమించరన్నారు.

మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ఎస్‌సి నిధులను దారిమళ్లించడం సరికాదు : కెవిపిఎస్

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ వెంకటయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎస్‌సిలకు కేటాయించిన నిధులను నవరత్నాలకు మళ్లించడం సరికాదని అన్నమయ్య జిల్లా కులవివక్ష పోరాట సంఘం జిల్లా కో-కన్వీనర్ డి.సి. వెంకటయ్య, కమిటీ సభ్యుడు సిరిపురి రామచంద్ర తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆంధ్ర రాష్ట్రాన్ని ఎంతోమంది ముఖ్యమంత్రి పరిపాలించినప్పటికీ ఎస్సీ కార్పొరేషన్ ఖాళీగా పెట్టిన సందర్భాలు లేదన్నారు. దళితుల పొట్ట కొట్టి వారి చేతుల్లో బొచ్చపెట్టిన మొట్టమొదటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నారు. ఉపాధి కోసం దరఖాస్తు చేస్తే కార్పొరేషన్‌లో పది పైసలు కూడా లేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఒకపక్క దళితులను అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెబుతూనే మరో వైపు దళితుల భూములు ఏదో వంకతో లాక్కుంటూ వారి పైన దాడులు చేస్తూ అక్రమాలు, దౌర్జన్యాలు చేస్తున్నారని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌లో స్కాలర్‌షిప్‌లు ఇచ్చేవారని, ప్రస్తుతం వాటిని కూడా తీసేశారని పేర్కొన్నారు. దళితుల అభివృద్ధికి 105 పథకాలు ఉన్నప్పటికీ ఏఒక్కటీ తమ దాకా రాలేదన్నారు. కార్పొరేషన్ ద్వారా పేదవారికి భూములు కొని ఇవ్వాలని ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటూ ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, మిగులు భూములు పంచాలని డిమాండ్ చేశారు.

సంజీవరాయ స్వామికి పొంగళ్లు పెడుతున్న మగవారు

వింత ఆచారం.. మగవారి పొంగళ్ల వేడుక

ప్రజాశక్తి - పుల్లంపేట

దేవుళ్లకు ఎక్కడైనా ఆడవాళ్లు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటారు. అయితే ఇక్కడ మాత్రం మగవాళ్లే పొంగుబాళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటూ ప్రత్యేక ఆచారాన్ని చాటుతున్నారు. మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో అనాదిగా వస్తున్న ఆచారాన్ని పాటిస్తూ మగవాళ్ల పొంగళ్లను ఘనంగా జరుపుకొంటున్నారు. ప్రతి ఏడాదీ సంక్రాంతికి ముందు వచ్చే ఆదివారం.. సంజీవరాయునికి పొంగళ్లు పెడతారు. సంక్రాంతి కంటే పొంగళు పండుగనే గ్రామస్థులు ఘనంగా జరుపుకొంటారు. గ్రామానికి చెందిన వారు దేశవిదేశాల్లో ఎక్కడున్నా సంక్రాంతి పండుగ ముందు వచ్చే ఆదివారం ఇక్కడికి చేరుకుంటారు. ఇక్కడ సంజీవరాయునికి విగ్రహమంటూ లేదు. ఓ రాతిని ప్రతిష్టించి దానిపై శాసనం రాశారు. దాన్నే నేటికీ సంజీవరాయుడిగా భావిస్తూ పూజలు చేస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు.

అల్ట్రా పల్లె వెలుగులో రూ.10 అదనపు ఛార్జీ

గాలివీడు: అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో అదనంగా రూ.10 ఛార్జీ వసూలు చేస్తూ నడ్డి విరుస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. గాలివీడు, రాయచోటి, కదిరి డిపోకు చెందిన అల్ట్రా పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులలో పది రూపాయలు అదనంగా ప్రయాణికులు వసూలు చేస్తున్నారు. అల్ట్రాపేరుతో అదనపు వసూలు చేయడమేగాక స్టేజీలు లేని ప్రాంతాల్లోనూ బస్సులు ఆపుతున్నారని వాపోయారు. పైగా సమయ పాలన కూడా పాటించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి ప్రయాణికులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

గెలుపోటములు సహజం : ఎస్ఐ

సుండుపల్లి: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రశాంతంగా ఆడాలని సుండుపల్లె ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో మండల కేంద్రంలో భాగంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఐదు రోజులపాటు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషదాయకం అన్నారు. మారుమూల ప్రాంతంలోనూ రూ. 30 వేల బహుమతితో టోర్నమెంట్ నిర్వహించడం క్రీడాకారులకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోటీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆర్గనైజర్లు, క్రీడాకారులు ఎస్ఐని సన్మానించారు.

మహాత్ముల ఆశయాలను కొనసాగించండి : డిఇఒ

రాయచోటి: మహాత్మ జ్యోతిరావు పూలే, భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని డిఇఒ వై.రాఘవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బిటిఎ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీలో ప్రముఖుల చిత్రాలు ముద్రించడం బావుందన్నారు. ఏ వసతులూ లే, వివక్ష అధికంగా ఉన్న కాలంలో పూలే దంపతులు పేద బడుగు బలహీన వర్గాలకు చదువు చెప్పడానికి అకుంఠిత దీక్షతో కృషి చేశారని చెప్పారు. అనేక వివక్షలను ఎదుర్కొని బాబాసాహెబ్ రాజ్యాంగం రాసే స్థాయికి ఎదిగారని వా ఆశయాలను కొనసాగిస్తూ పేద పిల్లలకు గుణాత్మక విద్యనందించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు రాయచోటి రవిశంకర్ ,ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్ ,అదనపు ప్రధాన కార్యదర్శి పల్లం జనార్దన్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ రాజారత్నం, ఏవీ రమణ, ట్రెజరర్ రాజశేఖర్, రాయచోటి మండల అధ్యక్షుడు రఘు, కలికిరి మండల అధ్యక్షుడు పల్లం కిరణ్ కుమార్ ,బీటీఏ నాయకులు రమణ పాల్గొన్నారు.

బిటిఎ డైరీని ఆవిష్కరిస్తున్న డిఇఒ రాఘవరెడ్డి

మాట్లాడుతున్న డివైఇఒ కృష్ణప్ప

విద్యార్థులకు మాదిరి ప్రశ్నపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

200 మంది విద్యార్థులకు యుటిఎఫ్‌చే రూపొందించిన మోడల్ పేపర్స్‌ను డివైఇఒ కృష్ణప్ప ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సమయంలో పెద్దమనసుతో యుటిఎఫ్ నాయకులు మోడల్ పేపర్స్‌ను విద్యార్థులు పంపిణీ చేయడం చాలా సంతోషమని పేర్కొన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి మార్కులు సాధించాలని తెలిపారు. తాను కూడా హాస్టల్ ఉండి చదివి ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. ఎంపిడిఒ, ఎంఇఒ మాట్లాడుతూ మారిన పరీక్షలకు అనుగుణంగా ఈ మెటీరియల్స్ రూపొందించామన్నారు. చడం జరిగినదని నివల్ల విద్యార్థులు ఎంతో ప్రయోజనం పొందుతారని తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, అసోసియేట్ అధ్యక్షులు హేమలత, రాష్ట కౌన్సిలర్స్ రవి ప్రకాష్, పురం వెంకటరమణ, డివిజన్ కన్వీనర్ సుధాకర్, రిటైడ్ హెడ్మాస్టర్ శ్రీనివాసరాజు, వెంకటయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

సర్పంచ్ సురేష్ దంపతులను అభినందిస్తున్న ఫర్వీన్‌తాజ్

ఘనంగా సర్పంచ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పిటిఎం మండలంలోని దేవప్పకోట సర్పంచ్ అనిత సురేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సురేష్ తన జన్మదినాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఫర్వీన్ తాజ్ హాజరై శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సర్పంచ్ అనిత సురేష్ నిర్విరామ కక్ష్మిబుషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బుర్లపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పట్టా చంద్రమోహన్ రెడ్డి, అంకిరెడ్డిపల్లి రమేష్ రెడ్డి మగ్గాల రవి,తంబళ్లపల్లి నియోజకవర్గం వాల్మీకి సంఘ అధ్యక్షుడు చావిడి కిట్టన్న, టిడిపి మాజీ మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, టిడిపి కళా బృందం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పళ్ల నారాయణస్వామి,మడుమూరు యువ నాయకుడు నవీన్, భార్గవ్, అశోక్ బుర్లపల్లి శంకర, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

టాస్ వేస్తున్న టిడిపి పాలక మండలి మాజీ సభ్యులు ప్రసాద్‌బాబు

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-చిన్నమండం

మండల కేంద్రంలో సతీష్ రాయల్ అధ్వర్యంలో నిర్వహించబోయే మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం టిడిపి పాలకమండలి మాజీ సభ్యులు, టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని తొలుత సరదాగా బ్యాటింగ్ చేసి శుక్షాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు రాంప్రసాద్ నాయుడు, సిద్దయ్య, బాలు, సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, శంకర, సైపుల్లాఖాన్,వాజిద్, తంజీర్, ఫరూక్, జాఫర్ ఖాన్, బరకత్, టమాటాల శివారెడ్డి, మహేష్, గౌస్‌ఖాన్, ప్రవాజ్, బడిశెట్టి రవి, ఖాజా, ప్రసాద్, అఫ్రోజ్, ముని పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

నందలూరు: సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలులో భాగంగా ఆదివారం అరవ పల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. ఈ పోటీలను వైసిపి రాష్ట్ర నాయకులు మేడా విజయ శేఖర్ రెడ్డి, ఎస్ఐ మైనుద్దీన్, నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయ భాస్కర రావులు ప్రారంభించారు. ఈ పోటీలలో అన్నమయ్య, కడప ఉభయ జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొనగా విజేతలుగా కడప జేజే లెవెల్స్, రన్నర్స్‌గా కోడూరు 2, కోడూరు 1 జట్లు బహుమతిని గెలుపొందాయి. విజేతలకు రూ.10 వేలు, రన్నర్స్‌కు రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.4 వేలను 12వ తేదీ సాయంత్రం పంచాయతీ కూడలిలో నగదు బహుమతిని అందజేయున్నట్లు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోతురాజు మస్తానయ్య, ఆర్ముగం విశ్వనాథులు తెలిపారు.

సబ్ పోస్ట్ మాస్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - కలకడ

మండలంలోని కె.దొడ్డిపల్లి పంచాయతీ దొడ్డిపల్లిలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా 36 ఏళ్లు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సబ్ పోస్ట్‌మాస్టర్ శరత్ కుమార్ ఘనంగా సన్మానించారు. పుంగనూరు బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని మర్రిమాకులపల్లెకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఆయనను ఆదివారం కలకడ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ 36 ఏళ్లుగా కలగడ సబ్ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో పనిచేయడానికి ఆనందంగా ఉందన్నారు. నాకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

సబ్ పోస్ట్‌మాస్టర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

చంద్రబాబును పవన్ కలిస్తే వైసిపికి ఉలికిపాటెందుకు? : టిడిపి

ఇదేం ఖర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నందలూరు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలిస్తే ఇంత ఉనికిపాటు ఎందుకని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్ రాయుడు సూచన మేరకు ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నాగిరెడ్డిపల్లెలో నిర్వహించారు. ఈ సందఠరేగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని వాటిని గాలికి వదిలేసిన జగన్ ప్రభుత్వం ప్రజల పక్షాన ప్రజల సమస్యల పరిరక్షణ కోసం తెలుగుదేశం పార్టీ ఉద్యమాలు చేస్తుంటే ఉద్యమాలు అనగతొక్కడానికి జీవో నెంబర్ ఒకటిని తేవడం దుర్మార్గమన్నారు. గతంలో బ్రిటిష్ వాళ్లు భారత దేశంలో ఉద్యమాలు జరగకూడదు తెచ్చిన జీవోనే జగన్ తెచ్చిన ఒకటో జీవో ఈరోజు ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలందరూ కూడా స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ ప్రభుత్వంపై భారతీయులందరూ ఏవిధంగా ఉద్యమం చేసి స్వాతంత్రం సాధించారో అదే స్ఫూర్తితో ఆంధ్ర రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పై ఉద్యమం చేసి ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గదితిప్పేంతవరకు మన ఉద్యమం ఆగకూడదన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్‌శంకర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జ్యోతి శివ, మండల ఉపాధ్యక్షులు చామంచి పెంచలయ్య, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొగిలి కాలవ శివ, నాయకులు టిఎన్ఎస్ఎఫ్ సుబ్బయ్య,కనుకుర్తి వెంకటయ్య, కాశి గారి పెంచలయ్య, యూసఫ్, గౌస్ బేగ్, మునుస్వామి, కాశి గారి నరేష్,ఎంపీ రావు, నాయన పల్లి తిరుపాల్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రెక్కింగ్‌లో పాల్గొన్న మిట్స్ విద్యార్థులు

హార్సిలీహిల్స్‌లో మిట్స్ విద్యార్థుల ట్రెక్కింగ్

ప్రజాశక్తి-కురబలకోట

మదనపల్లి మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్స్ స్థానిక హార్సిలీహిల్స్‌లో ట్రెక్కింగ్ నిర్వహించారు. కళాశాలలోని ఎన్‌సిసి క్యాడెట్స్ ఉదయం హార్సిలీహిల్స్‌పైకి చేరుకున్నట్లు ఎన్‌సిసి లెఫ్టినెంట్ ఎన్.నవీన్ కుమార్ తెలిపారు. దేశ రక్షణ కొర్కై అత్యవసర సమయాలలో ప్రతి ఒక్కరిని కాపాడుటకు వీలుగా క్యాడెట్స్ ట్రైనీ అయి ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. కళాశాల ఎన్‌సిసి క్యాడెట్స్ సుమారు 100 మంది ఎంతో ఆసక్తిగా ఈ కార్యక్రమం పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులకు రోప్ హ్యాండ్లింగ్, హిల్ క్లిబింగ్ మొదలైన వాటిపై శిక్షణను అందజేశామన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభించి 11 గంటలకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. హిల్స్‌కి చేరుకొని అక్కడ క్యాడెట్స్ సి సెరిటిఫికేట్, బి సర్టిఫికెట్‌పై అవగాహన కల్పించారు.

రెడ్డి జెఎసి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-కలికిరి

రెడ్డి జెఎసి బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రెడ్డి జెఎసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పులి సత్యనారాయణరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక ఎన్ఎస్ కళ్యాణ మండపంలో రెడ్డి జెఎసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి జెఎసి సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెడ్డి జెఎసి బలోపేతం కావాలని, దానికి రెడ్డి కులస్తులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రెడ్డి అంటే ఇతరులకు సహాయపడుతూ అందరి మన్ననలు పొందే వారని, అయితే ఇప్పుడు సమాజంలో ఆదరణ కోల్పోతున్నామని, ఏ ప్రభుత్వం వచ్చిన ఓట్ల కోసం రెడ్లను బలమైన సామాజిక వర్గం అని చెబుతూ, అభివృద్ధికి ఆటంకం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి ఉన్నత చదువులు చదివి ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తే రిజర్వేషన్లు పేరు చెప్పి రెడ్డి కులస్తులను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన పిల్లల ఆత్మస్థైర్యం దెబ్బతిని ప్రైవేటు ఉద్యోగాలు కోసం బయట రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రెడ్డి సామాజిక వర్గంలో ఎంతోమంది పేదలు ఆర్థికంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. జెఎసి ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వివాహ పరిచయ సమాచారాలు, ట్రస్టు ద్వారా వచ్చే ఆదాయంతో పేదలకు సహాయం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా రెడ్డి జెఎసి ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేయించి అందులో ఉన్న ప్రతి ఒక్క సభ్యులకి గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని తద్వారా ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా త్వరితగతిన వారిని ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులురాంప్రసాద్‌రెడ్డి, కాంట్రాక్టర్ శేషు కుమార్‌రెడ్డి, క్రాస్ రోడ్ మధు రెడ్డి, రమణారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, కలికిరి, కలకడ, పీలేరు, గుర్రంకొండ, కె.వి పల్లి వాయల్పాడు, మండలాల నుంచి రెడ్డి జెఎసి సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నరహరి, బత్యాల

పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని చింతకాయ పల్లి లో పార్లమెంటు స్థాయి క్రికెట్ టోర్నమెంట్ను అట్టహాసంగా రాజంపేట పార్లమెంట్ టిడిపి అభ్యర్థి గంట నరహరి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ బత్యాల చంగల్ రాయుడు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా బత్యాల చెంగల్ రాయుడు బౌలింగ్ చేస్తే గంటా నరహరి బ్యాటింగ్ చేశారు. తర్వాత గంట నరహరి బోలింగ్ చేస్తే బత్యాల చెంగల్ రాయుడు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను అలరింప చేశారు. ఈ సందఠరేగా టిడిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి, రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ బత్యాల చెంగల్ రాయుడు మాట్లాడుతూ యువకులు క్రీడా స్ఫూర్తితో ఉండాలన్నారు. క్రికెట్ ఆడటం వల్ల మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీలో బెస్తలను చేర్చుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సొసైటీలో మా బెస్తవారిని చేర్చుకోవాలని, సొసైటీలు బలోపేతం చేసుకోవాలని బెస్త సంక్షేమ సంఘం నాయకులు రమణ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో బెస్త సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అన్నమయ్య జిల్లా నుండి అన్ని మండలాల బెస్తకుల పెద్దలు రావడం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెస్త సంక్షేమ సంఘం ద్వారా మాకు రావాల్సిన మేము పొందాల్సిన డిమాండ్స్ చర్చించడం జరిగిందని అన్నారు. జిల్లాలో 30 మండలాలు ఉన్నాయని, 30 మండలాలకు 30సొసైటీలో కొత్త సభ్యుల చేర్చుకోవాలని, మా బెస్తవాళ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, మా వ ృత్తిని కాపాడుకోవడం కోసం మాకు రావాల్సిన నిధులు కాపాడుకోవడం కోసం మాకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని డ్8డిమాండ్ చేశారు. ఇప్పుడు 217 జీవోను వెంటనే రద్దు చేయాలని అన్నారు. సమావేశంలో కృష్ణమూర్తి, బిసి రెడ్డప్ప, నారాయణస్వామి, మల్లప్ప, సుధాకర్, ఈశ్వర, రూపేష్, నార్ధమని, నాగభూషణం, రెడ్డప్ప, మురళి, హరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బెస్త సంఘం నాయకులు

రిటైర్డ్ పెన్షనర్ల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

ప్రజాశక్తి-కలికిరి

ఫ్రెండ్స్ ఉన్నారు అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్ర రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం కలికిరి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ ఆవరణంలో రిటైర్డ్ పెన్షనర్ల సమావేశం జరుపబడింది. రాష్ట్ర శాఖ ప్రచురించిన రిటైర్డ్ ఎంప్లాయిస్ డైరీలను ఆయన విడుదల చేశారు. అనంతరం రిటైర్డ్ ఎంఇఒ వై.ఆదినారాయణ రెడ్డి పెన్షనర్ల సమస్యలపై ప్రసంగించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు జి.జయరాం, ఎల్‌కె విశ్వేశ్వరరావు సుబ్బరాజులు శెట్టి, టి.సరోజమ్మ, ఎం.కాంతమ్మ పాల్గొన్నారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రోటోకాల్ నిబంధనలు పాటించని మదనపల్లె పురపాలక కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ 23వ వార్డు కౌన్సిలర్ వై.గిరిజ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వార్డులో చేపట్టే అభివృద్ధి పనులను ప్రోటోకాల్ ప్రకారం కౌన్సిలర్ ద్వారా ప్రారంభించాల్సి ఉండగా బయట వ్యక్తిచేత చేయి స్తున్నారని పేర్కొన్నారు. 23వ వార్డులో జీవోకు విరుద్ధంగా కౌన్సిలర్ అయిన తనను సంప్రదించకుండా ఇతర వక్తుల చేత పంపిణీ చేయిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. పించన్లు, ఇంటి పట్టాలు, రేషన్కార్డులు పంపిణీ వంటివి ప్రోటోకాల్ ప్రకారం వార్డు కౌన్సిలర్ చేత ఇప్పించాలని ప్రభుత్వం ఖచ్చితమైన జీవోను జారీ చేసిందన్నారు. ఈ సమస్యపై ఇది వరకే మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశానని, దీనిపై ఎలాంటి చర్యలు తీసుకో కపోగా, ఈ నెల 3వ తేదీ ప్రజాప్రతినిధి కాని ఇతర వ్యక్తులచే పింఛను, ఉచిత రేషన్ పంపిణీ చేయించడం జరిగిందన్నారు. ప్రోటోకాల్ను, జీవో అమలును ఉల్లంఘించిన అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఇక మీదట పంపిణీ చేసే ప్రభుత్వ పథకాలను కౌన్సిలర్ ద్వారానే అందజేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

బ్రౌన్ సమగ్ర ప్రగతికి కృషి : విసి

కడప అర్బన్ : పాఠకుల ప్రయోజనమే పరమావధిగా సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సమగ్ర ప్రగతికి కృషి చేశానని యోగివేమన విశ్వ విద్యాలయం వి సి ఆచార్య మునగల సూర్యకళావతి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపకులపతిగా ఆచార్య సూర్యకళావతి పదవీ కాలం పూర్తయిన సందర్భంగా ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అధ్వర్యంలో ఆచార్య ఆమెను శాలువ, జ్ఞాపిక, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భం సూర్యకళావతి స్పందిస్తూ తాను ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించాక సి. పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. గ్రంథపాలకులు ఎన్. రమేశ్ రావు, అలుమ్ని అసోషియేషన్ అధ్యక్షులు డా. తుమ్మలూరు సురేష్ బాబు, సీమ పర్యాటక ప్రతినిధులు పంతుల పవన్ కుమార్, కొండూరు జనార్ధనరాజు, ఎస్. ఎం. బాష, లలితకళల విభాగం అధ్యాపకులు విసిని సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు జి.హరిభూషణ రావు, ఆర్.వెంకటరమణ, యం. మౌనిక, పి. నీలకంఠేశ్వర్, పి. చంద్రకిశోర్ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సుకు తరలిరండి

కడప అర్బన్ :కార్మిక, కర్షక, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో ఈనెల 9న ఉదయం10 గంటలకు ఎంబి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు బి. మనోహర్, దస్తగిరి రెడ్డి, అన్వేష్ సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న నేటికీ కార్మికులు, కర్షకులు మూడు పూటలా తినడానికి తిండి లేనటువంటి పరిస్థితి ఉందని తెలిపారు. స్వాతంత్ర్య ఫలాలు పేదలకు అందలేదని, బడా బూర్జువా భూస్వామ్య పెట్టుబడిదారులకు పారిశ్రామికవేత్తలకు కార్పొరేట్ కంపెనీలకు దక్కాయని ఆయన అన్నారు. ఇ ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, రైల్వేలు తదితర నవరత్నాల లాంటి కంపెనీలు అన్నీ ప్రయివేటీకరణ చేస్తోందని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లా జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలి

కడప అర్బన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు ఉమ్మడి కడప జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఫిబ్రవరి 8, 9 తేదీలలో ప్రొద్దుటూరు పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు తెలిపారు. కడప నగరంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో జిల్లా జనరల్ కౌన్సిల్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)2020 పేరుతో విద్యారంగాన్ని కాషాయికరణ కార్పోరేటికరణ చేస్తుందని పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 198 న్యాయ విజ్ఞాన సదస్సులు

కడప: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లావ్యాప్తంగా 198 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప, విభిన్న ప్రతిభా వంతులు ట్రాంజెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచా లకులు, డిస్ట్రిక్ పంచాయతీ ఆఫీస్, ఎన్జీవోస్, పారా లీగల్ వాలంటరీలు సహకారంతో జిల్లా వ్యాప్తంగా 198 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించామన్నారు.

పిసిసి డెలిగేట్స్ నియామకం

కడప : అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పిసిసి డెలిగేట్స్ నియామకం చేపట్టారు. కడప జిల్లా నుండి 14 మందికి ఇందులో చోటు దక్కింది. కాంగ్రెస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు ఆధారంగా కొంత మందిని, నాయకత్వం ఆధారంగా మరికొంతమందిని ఏఐసిసి అధిష్టానం నిర్ణయించి పీసీసీ డెలిగేట్స్‌గా నియమించింది. కడప జిల్లా నుండి నరెడ్డి తులసిరెడ్డి, నీలి శ్రీనివాసరావు, కమలమ్మ, నజీర్ అహమ్మద్, బండి జకరయ్య, విష్ణుప్రీతం రెడ్డి, బొజ్జా తిరుమలేష్, శర్మ ఉన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

దుస్తుల పంపిణీ అభినందనీయం : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి

సంక్రాంతి పండగ పురస్కరించుకుని శ్రీ అయ్యప్ప స్వామి సొసైటీ అధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమం ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మడితాటి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి సేవా సొసైటీ అధ్వర్యంలో సుమారు 400 మంది విద్యార్థులకు సొసైటీ అధ్యక్షులు వీరబల్లి బసిరెడ్డి, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు మురళి మోహన్ రాజు తో కలిసి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి సొసైటీ ఏర్పడినప్పటి నుంచి విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేయడం హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం

ప్రజాశక్తి-రామాపురం

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని మాజీ ఎంఎల్‌ఎ గడికోట మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్పనాయన చెరువు గ్రామంలో ఆదివారం వైఎస్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయనకు టోర్నమెంట్ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటమి సహజమని, యువకులు క్రీడా స్ఫూర్తితో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ చైర్మన్ కర్ణప్ప విశ్వనాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి మాజీ సర్పంచ్‌లు వెంకటసుబ్బారెడ్డి, కృష్ణయ్య, వైసిపి నాయకులు, వెంకటరామిరెడ్డి, చెన్నారెడ్డి, వెంకట నారాయణరెడ్డి, ప్రకాష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రాఘవ, చిన్నప్ప, చలపతి, జనార్దన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మతిస్థిమితంలేని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-రామపురం

మృతి చెందిన దిల్షాద్

మండలంలోని సుద్ద మళ్ల పంచాయతీ దూదేకులపల్లి చెందిన మతిస్థిమితం లేని మహిళ కొండూరు దిల్షాద్(32) అనే శనివారం రాత్రి విషద్రా వణం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ కొండారెడ్డి కథనం మేరకు.. మృతు రాలు కడప జిల్లా సికేదిన్నె మండలానికి చెందిన కొండూరు దిల్షాద్‌కు 13 ఏళ్ల కిందట రామాపురం మండలం దూదేకులపల్లి చెందిన కొండూరు దర్బార్ బాషాతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె భర్త జీవనోపాధికై కువైట్‌కి వెళుతూ ఇంటికి వస్తూ ఉంటారు. ఈ మధ్యలోనే ఆమెకు అప్పుడప్పుడు మతిస్థిమితం లేకుండా వీధుల వెంట తిరుగుతూ ఉండేదని ఆమె బంధువులు పేర్కొన్నారు. చికిత్స నిమిత్తం గత ఏడాది సెప్టెంబర్‌లో కడప రిమ్స్‌లో చికిత్స చేయించారు. మృతురాలి భర్త 2 నెలల కిందట జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారని అప్పటినుంచి ఈమె ఆరోగ్య పరిస్థితి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి విషద్రావణం తాగింది. పరిస్థితి విషమంగా ఉండ డంతో 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

20 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి -కలకడ

నాటుసార తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని స్థానిక కోన క్రాస్ వద్ద నాటు సారా తరలిస్తున్నట్లు స్థానిక పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో గుర్రంకొండ మండలం టి.గొల్లపల్లి పంచాయతీ తుమ్మల గొందికి చెందిన వెంకటరమణ కుమారుడు ప్రభాకర్ 20 లీటర్ల నాటు సారా తరలిస్తూ పట్టుబడ్డాడు. 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది శ్రీనివాసులు, రాజేంద్ర, తాతయ్య, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య : కేసు నమోదు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. ఎస్.ఐ.రామ్మోహన్ కథనం మేరకు వివరాలు. బీరంగి పంచాయతీ కంబళ్లపల్లికి చెందిన పూసల మునిరాజ(30) బీరంగి పంచాయతీ, బెంగళూరు రోడ్డులో గల చర్చికి ఎదురుగా ఉన్న రవి అనే రైతు మొక్కజొన్న పొలంలో విషం తీసుకొని చనిపోయినాడన్నారు. ఆదివారం ఉదయం రవి, వారి బావమరిది మొక్కజొన్న కంకులు కోస్తుండగా ఇతను చనిపోయి పడిఉండడం గమనించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారని, అక్కడకు వారు వచ్చి మునిరాజను గుర్తించడమైందన్నారు. మృతుడు ఆత్మహత్యకు గల కారణాలు విచారించగా ఇతనిది కర్ణాటక రాష్ట్రంలోని బాగేపల్లి తాలుకా గౌరబిదనూరని తేలిందన్నారు. ఇతనికి కంబళ్ళపల్లిలోని పూసల శోభ అనే మహిళతో వివాహం జరిగిందని, వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. వివాహం అయినప్పటి నుండి కంబళ్లపల్లిలోనే ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ ఉంటాడని,ఇతనికి మద్యం అలవాటు ఉందని,మద్యం మత్తులో కుటుంబాన్ని పట్టించుకునే వాడు కాదని,మద్యం సేవించడం మానేయమని చెప్పినందుకు తన భార్యతో తరచూ గొడవ పడుతూ ఉండేవాడిన్నారు.ఇదిలా ఉండగా ఈనెల 6వ తేదీ ఉదయం తన సొంత ఊరైన గౌరబిదునూరుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్ళినాడని, ఇంతలో విషం తాగి చనిపోయినాడని భార్య శోభ ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోద దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - పెద్దమండ్యం

మండలంలోని కలిచర్ల పంచాయతీ తాటిమకులపల్లికి 200 మీటర్ల సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.1,50,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తిరుపాల్ నాయక్, చాన్‌బాషా, సోంశేఖర్, ప్రసాద్‌రెడ్డి నిందితుల్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.